# నవలల పోటీ ఫలితాలు

ప్రథమ బహుమతి రు. 2000

**మానవుడు**

రచయిత: కంఠంనేని రాధాకృష్ణమూర్తి

ద్వితీయ బహుమతి రు. 1000

**ఆకాశానికి అటూ ఇటూ**

రచయిత: శివాజీ

తృతీయ బహుమతి రు. 750

**కడలి అంచు కాపురం**

రచయిత: పాలకోడేటి సత్యనారాయణరావు

సాధారణ ప్రచురణకి స్వీకరించబడిన నవలలు

| | | |
|---|---|---|
| పీడకల | : | యర్రంశెట్టిశాయి |
| కాశీయాత్ర | : | చెల్లూరి సీతారాజేశ్వరరావు |
| వెలుతురులో చీకటి | : | నెల్లూరి కేశవస్వామి |
| మైత్రేయి | : | శివల జగన్నాధరావు |
| సూర్యమిత్ర | : | జొన్నలగడ్డ లలితాదేవి |
| పోటీ లేనిపరుగు | : | వి. రాజారామమోహనరావు |

కళాశాల విద్యార్థుల కథల పోటీలో మొదటి బహుమతి పొందిన కథ

# ఉపదేశం


ఎన్. వి. ఆర్. జ్యోతికుమార్ బి. కాం. (ప్రథమ)

డి. ఎన్. ఆర్. కాలేజి, భీమవరం.


"గుడ్ మార్నింగ్ డాక్టర్!"

"హలో, నువ్వటోయ్ విజయ్, రా! కూర్చో."

డాక్టర్‌కి ఎదురుగా వున్న కుర్చీలో కూర్చున్నాడు విజయ్.

"ఏమిటి నీ కంప్లయింట్?" మెడకి వున్న స్టెతస్కోపును చెవుల్లో దూర్చుకుంటూ అడిగాడు డాక్టర్.

విజయ్ ఏమీ మాట్లాడలేలేదు. తల వంచుకుని కూర్చున్నారు.

"ఇంట్లో అంతా బావున్నారా?" అనుమానంగా అడిగాడు డాక్టర్.

"అంతా కులాసాగానే ఉన్నారు డాక్టర్."

"మరేమిటోయ్ నీ కంప్లయింట్?"

"నేను...."

"వైఫ్ దగ్గిరా, డాక్టర్ దగ్గిరా సిగ్గు పనికి రాదోయ్. సిగ్గుపడితే అది తమకే నష్టం" అన్నాడు డాక్టర్.

"నేను కాలుజారాను డాక్టర్."

"అయ్యో, యెక్కడ జారావేమిటి? ఏది చూడనీ నీ కాలు."

"ఎబ్బే, కాలు జారడమంటే....కాలుజారలేదండీ...."

"ఏమిటోయ్ నువ్వనేది? నాకేం అర్థం కావడంలేదు" కాస్త విసుగ్గా అన్నాడు డాక్టర్.

"లేదు డాక్టర్, నేను.......నా గర్ల్ ఫ్రెండుతో...."

డాక్టర్‌కి ఈసారి సంగతి అర్థమైంది. తేలిగ్గా నవ్వేస్తూ—

"ఓహ్, అదటోయ్ సంగతి. దీనికే ఇంత హడలిపోవాలా? అది నీ తప్పు కాదు, నీ గాళ్ ఫ్రెండు తప్పు అంతకన్నా కాదు. మీ వయసుది! కాదంటావా? అయితే తప్పు ఇంతదాకా నిన్నొక యింటివాణ్ని చేయని మీ నాన్నది. ఏమంటావ్?"

"అవున్సార్...."

"సరే, కిందటి యేడాది నేను స్టేట్స్‌కి వెళ్ళొచ్చాను—తెల్సుగదా నీకు?"

"తెల్సండి."

"అయితే చెప్తాను విను. బుద్ధిగా కూర్చో ....జాగ్రత్తగా వినాలి....మనదేశంలో లైంగిక స్వేచ్ఛ లేదోయ్. కట్టుబాట్లు, సాంప్రదాయాల బంగారు సంకెళ్ళతో అనాదికాలం నించి యువతరాన్ని బంధించివేస్తున్నారు. అదేమంటే, ఇదంతా మన సంస్కృతనో, నాగరికతనో చక్కటి పేర్లు పెడతారు. అదే స్టేట్స్‌లో అయితే యిట్లాంటి నాన్సెన్స్ నిబంధనలు, కట్టుబాట్లనేవి మచ్చుకైనా కనబడవ్. లైంగిక స్వేచ్ఛ వుండబట్టే ఆ దేశమంతగా డెవలప్ అయింది. మరి మన దేశమో?...."

"అవున్సార్."

"....ఇట్లాంటి కట్టుబాట్లకి నేను చాలా వ్యతిరేకినోయ్. మనకు స్వాతంత్ర్యం వచ్చిందని చంకలు కొట్టుకుంటున్నాం. అయితే లైంగిక స్వేచ్ఛ ఎక్కడుందోయ్? ఏమంటావ్?

"కమ్ టుద పాయింట్. ఇంతకూ ఇప్పుడా అమ్మాయికి అబార్షన్ చేయాలంటావ్."

"అవున్సార్. యేవైనా మందులు రాసిస్తే...."

"ఎబ్బే, పేషంటుని టెస్టు చేయందే మందులు రాయడం కుదర్దోయ్."

"అది కాదండి. ఆడపిల్ల..మీ దగ్గిరికి ఎలా రాగలదండి...."

"నే నింతదాకా నెత్తీ నోరూ కొట్టుకుని నీకు చెప్పిందేమిటోయ్, సిగ్గుపడాల్సినంత నేరమేం చేయలేదోయ్ మీరు."

"అవుననుకోండి. కానీ...."

"ఆమాత్రం ఒప్పించలేవా ఆ అమ్మాయిని.

ఇట్లాంటి కేసుల్లో తప్పనిసరిగా పరీక్ష చేసి తీరాలి."

"అయితే రేపే తీసుకొస్తాను సార్."

"బైదిబై, యింతకీ యెవరన్నావ్ ఆ అమ్మాయ్?"

"నా క్లాస్‌మేట్ సార్! మిస్ సుజాత.... అంటే స్వయానా మీ...."

గుడ్లు తేలేసి కుర్చీలో ఓ పక్కకి ఒరిగిపోతున్న డాక్టర్ని చూసి, "నర్స్....నర్స్...." అని కేకలు వేశాడు విజయ్. □

కళాశాల విద్యార్థుల కథల పోటీలో రెండవ బహుమతి పొందిన కథ

# అందం

పోత్రిన భవానీశంకర్ బి. ఎస్‌సి. (తృతీయ)విక్రమ్‌దేవ్ కాలేజి, జైపూర్

"హాయ్ స్మాల్‌పాక్స్ బ్యూటీ" అని నేను కామెంట్ చేయటంతో చప్పట్లు మారుమోగాయి. ఫ్రెండ్స్ అందరూ నన్ను ఆకాశానికి ఎత్తేశారు. పెద్ద ఘనకార్యం సాధించిన హీరోలా ఫీలయ్యాను. ఎదురుగా వస్తున్న నీరజ తల దించుకొని వెళ్ళిపోయింది.

నీరజ నిజానికి యెంతో అందంగా ఉంటుంది. ఆ ముఖంపైన మశూచికం మచ్చలు లేకపోయి వుంటే ఆమె అందం నిరుపమానం. స్నేహితుల ప్రోత్సాహంతో అలా కామెంట్ చేశానే కాని తర్వాత బాధపడ్డమాట నిజం. అలా యెందుకు కామెంట్ చేశానా అనిపించింది.

క్లాసు అయిపోయిన తర్వాత నీరజ వెనుక నుండి పిలుస్తుంటే గబగబా వచ్చేద్దామనుకొన్నా సాధ్యంకాలేదు. ఇంతలో నీరజ వచ్చి "కంగ్రాచ్యులేషన్స్ గోపీ, గొప్ప పనే చేశావు. ఒక చిన్న సలహా, ఒకరి గురించి కామెంట్ చేసేముందు ముందుచూపు వుండడం మంచిది. మనం చేసే కామెంట్‌ని ఎదుటి వ్యక్తి సంతోషంగా తీసుకొంటేనే అందం. థాంక్యూ" అని చరచర తిరిగిచూడకుండా వెళ్ళిపోయింది.

* * *

పరీక్షలు అవుతూ ఉన్నాయి. ఈ ప్రాక్టికల్స్‌తో పరీక్షలయిపోయినట్టే. ఏమిటో కెమిస్ట్రీ అంటేనే గాభరా. ఇంకా పది నిముషాలు మాత్రమే ఉంది. ఈ లోపల సాల్టు ఎనాలిసిస్ చేసితీరాలి. ఎందుకో టెస్టుట్యూబ్ లోని యాసిడ్ యింకా బాయిల్ అవడంలేదు. మంట (ఫ్లేమ్) పెంచాను. అంతలో యేదో పేలిన శబ్దం. ముఖంపై ఏదో చిలకరింపు. కళ్ళు మంటలు. అంతే....మర్నాడు చూస్తే నా ముఖం అంతా కమిలిపోయినట్లు అక్కడక్కడా మడతలు. మడతలూ, మచ్చలూ! అబ్బా! చిన్నపిల్లలు చూస్తే దడుచుకొనేలా ఉన్నది నాముఖం. ఒకనాటికాలేజీ హీరోముఖం.

* * *

కాలేజికి బయల్దేరాను. గేటువద్ద నీరజ తన స్నేహితురాండ్రు గుమికూడి ఉన్నారు. సరాసరి వారి దగ్గరకు వచ్చాను. అంతే - పకపక నవ్వులు, చప్పట్లు. నీరజ కామెంట్. "హాయ్,ఫోల్డుఫేస్ హాండ్‌సమ్"...."త్రీఛీర్స్ ఫర్ అవర్ ఫోల్డు ఫేస్ ప్రిన్స్...హిపిప్‌రే...."

హిపిప్....రే

హిపిప్....రే

నాలో సహనం నశించింది. ఒక్కసారిగా అరిచాను.

"స్టాపిట్....ఐసే....స్టాపిట్"

చప్పట్లు, పకపకలు అంతా బంద్....

కళ్ళు తెరిచాను—చుట్టూ చీకటి. నేను మంచంమీద....

"ఏమయింది?" అంటూ డాడీ, మమ్మీ వచ్చారు....అంటే ఇది కలా లేక నిజమా.... వెంటనే అద్దంలో చూసుకొన్నాను. ఏమీ కాలేదు. "థాంక్ గాడ్!"

మర్నాడు నీరజను క్షమించమన్నాను. అందుకు నీరజ ఇలా అన్నది. "పరవాలేదు గోపీ,యిప్పటికయినా తప్పు తెలుసుకున్నావు."

అప్పు డనుకొన్నాను నీరజకన్నా నీరజ మనసే అందమైందని. □

# పచ్చదనం

ఆదూరి వెంకట సీతారామమూర్తి

ఆదినారాయణరావుకి అర్జంటుగా పదిరోజులు సెలవు కావల్సి వచ్చింది. ఆఫీసరు ఆనందరావు చూడబోతే అఖండుడూ—అసాధ్యుడూను. చచ్చి గీపెట్టినా అరపూట లీవు కూడ ఇచ్చేట్టు లేదు. కంపెనీ కుర్ర డాక్టరు కూడా కొరకరాని కొయ్యే—ఓ కంతట నిక్కరాయడు.

'ఏం చేయాలీ?' అని రెండ్రోజులు సీరియల్‌గా బుర్ర గోక్కుని, సీరియస్‌గా ఆలోచించగా... చించగా ఓ అద్భుతమైన ఐడియా తట్టింది ఆనందరావుకి.

'వాళ్ళ కిదే మందూ—తన కిదే మార్గమూను' అనుకున్నాడు.

సరాసరి కంపెనీ కుర్ర డాక్టరు దగ్గరకెళ్ళి తనకు పచ్చకామెర్లన్నట్టు అనుమానంగా ఉందన్నాడు. పొట్టలో ఎడంవైపు నొప్పిగా వుంటూందనీ....యూరిన్ కలరూ గట్రా అన్నీ చెప్పాడు. అంతా విని; కళ్ళను తనకున్న జ్ఞానంతో పరీక్ష చేసి,

'నోనో—యూ ఆర్ ఆల్‌రైట్' అన్నాడాయన.

కుర్ర డాక్టరుమీద విపరీతమైన కోపమొచ్చింది ఆదినారాయణరావుకి. కానీ అది కన్పించనీయకుండా తనకు లేని ఓ బామ్మగార్ని సృష్టించి, ఆవిడగారు కామెర్ల స్పెషలిస్టనీ ఆవిడే యీ అనుమానాన్ని లేవదీసిందనీ కథ అల్లేడు. ఇలా కామెర్లను కానుకోలేకే మరో పాతికేళ్ళు బతకాల్సిన తన మామగారు అకస్మాత్తుగా హరీమన్నాడనీ చెప్పేడు.

అంతా విని కుర్ర డాక్టరు ఆలోచన్లో పడ్డాడు.

"మన కంపెనీలోసరియైన ఇన్‌స్ట్రుమెంట్స్ లేవు. ఏం చేయమంటారో మీరే చెప్పండి" అని ఆదినారాయణరావునే అడిగి, అతని సలహాపైనే 'యూరిన్ టెస్టు' కోసం ప్రైవేట్ క్లినిక్‌కి రిఫర్ చేశాడు. రొట్టె విరిగింది. ఇక నేతిలో పడ్డమే తరువాయి అనుకున్న ఆ. నా. రావు ఒకానొక ప్రైవేట్ క్లినిక్‌లో తనకు తెల్సినాయనచేత తన జబ్బు 'పచ్చకామెర్లే' అని ఋజువు చేయించుకుని, పదిహేనురోజుల సిక్ లీవు సంపాదించి హాయిగా స్వంతూరు వెళ్ళి పనులు చూసుకొని పదహారో రోజు ఆఫీసులో జాయినయ్యేడు.

ఆ సాయంత్రం యింటి కొస్తూంటే కడుపులో ఎడంవైపు చిన్ననొప్పి వచ్చింది ఆ.నా. రావుకి. ఇంటి కెళ్ళి యూరిన్ చూశాడు. సందేహంలేదు. కాఫీ అందిస్తూ-"మీ కళ్ళేమిటలా పచ్చగా వున్నాయ్?" అంది అతని భార్య. ఆదినారాయణరావు కళ్ళు నిజంగానే పచ్చబారేయి! □